
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 21 ఫిబ్రవరి 2024



సమ్మక్క-సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి 8లో..

కోల్‌బెల్ట్‌లో ఇంటింటా సమ్మక్క.. - మేకలు, కోళ్లతో మొక్కులు 8లో..



గోదావరిఖని సమ్మక్క - సారలమ్మ జాతర ప్రాంగణంలో ఏర్పాట్లు

ముస్తాబైన సమ్మక్క గద్దె

వన జాతరకు సర్వం సిద్ధం

- తొలిరోజు గద్దెనెక్కనున్న సారలమ్మ
- 22న గద్దెపై కొలువుదీరనున్న సమ్మక్క
- తల్లుల రాక కోసం ఎదురుచూస్తున్న భక్తజనం
- నేటి నుంచి సమ్మక్క సారలమ్మ జాతర
- రద్దీగా మారనున్న జాతర ప్రాంగణాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

సమ్మక్క సారక్క అబ్బియా... జాలారు బండల్లో అబ్బియా.. జంపన్న వాగుల్లో అబ్బియా.. అంటూ సమ్మక్క, సారలమ్మ జాతర ప్రాంగణాలు నేటి నుంచి మారుమోగనున్నాయి. డప్పుల చప్పుళ్లు.. శివసత్తుల పూనకాల మధ్య ఆ తల్లులు వనం వీడి జనారణ్యంలోకి రానున్నారు. ఆ దేవతల రాక కోసం నిలువెల్లా కనులై.. వారి దీవెనల కోసం పెద్దఎత్తున భక్తులు ఎదురుచూస్తున్నారు. భక్తుల ఇలవేల్పు.. కొంగు బంగారం.. కోరిన వరాలు ఇచ్చే ఆ దేవతలను పదిహేను రోజుల నుంచి మది నిండా తలచుకుంటూ పూజిస్తున్న భక్తులు వారిని దర్శించుకుని పునీతులయ్యేందుకు సంసిద్ధమయ్యారు. వారిని అమరత్వాన్ని స్ఫూర్తిగా తీసుకున్న భక్తులు ప్రతి రెండేళ్లకోసారి వారిని తలచుకుంటూ మొక్కులు అప్పగిస్తారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలోని జాతర ప్రాంగణాలన్నీ జనారణ్యంగా మారనున్నాయి. తెలంగాణ కుంభమేళాగా పేరొందిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ఉత్సవాలు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జరగనున్నాయి. మేడారంనకు అనుబంధంగా జిల్లాలో 30చోట్ల జరగనున్న జాతర ఉత్సవాలకు దేవాదాయ శాఖ, వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈనెల 21న సారలమ్మ గద్దెలపై కొలువు దీరడంతో జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అదేరోజు పగిడిద్దరాజు, గోవిందరాజులను కూడా జాతర ప్రాంగణాలకు తీసుక రానున్నారు. 22న సమ్మక్కను గద్దెకు తీసుకరానున్నారు. ఆరోజు నుంచి 24వ తేదీ వరకు దర్శించుకుని మొక్కులు అప్పగించ నున్నారు. అదేరోజు సాయంత్రం దేవతలు వన ప్రవేశం చేయడంతో జాతర ముగియనున్నది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే శ్రీసమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల సంఖ్య ప్రతిసారి పెరుగుతూ వస్తున్నది. జిల్లాలో ప్రధానంగా గోదావరిఖనిలోని గోదావరి బ్రిడ్జి, అంతర్గాం మండలం గోదావరి ఒడ్డునగల గోలివాడ, మానేరు ఒడ్డునగల సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల, ఓదెల మండలం కొలనూర్, కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట్, కమాన్‌పూర్ మండలం గుండారం, ముత్తారం మండలం మైదంబండలో ఎక్కువ మంది భక్తులు వస్తుంటారు. ఇవేగాకుండా మడక, గర్రెపల్లి, దొంగతుర్తి, హన్మంతునిపేట, తుర్కలమద్దికుంట, తదితర ప్రాంతాల్లో జాతర జరగనున్నది. గోదావరిఖనిలో జాతర ఏర్పాట్లను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు జాయింట్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించారు. స్థానికంగా జరిగే జాతరలతో పాటు మేడారంనకు కూడా జిల్లా నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివెళుతున్నారు. జిల్లాకు మేడారం దిగువన ఉండడంతో భక్తులు తాము నివసించే గ్రామానికి దిగువ ప్రాంతాల్లో జరిగే జాతరలకు వెళ్లి మొక్కులు సమర్పించడం ఆనవాయితీ.



పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన షవర్లు

● పదిహేను రోజుల నుంచే మొక్కులు..

జిల్లాలో పదిహేను రోజుల నుంచి ఇళ్లల్లో సమ్మక్కను చేసుకుని మొక్కు తీర్చుకుంటున్నారు. జిల్లా నుంచి వేలాది మంది ఇప్పటికే మేడారం వెళ్లివచ్చారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు మొక్కుల ప్రకారం ఆ తల్లులకు ఎత్తు బంగారం(బెల్లం) సమర్పించుకుంటున్నారు. జాతరలో ఆ తల్లులను దర్శించుకుని పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు, బంగారం(బెల్లం) సమర్పించుకుని మొక్కులు తీర్చుకుంటారు. గురువారం సాయంత్రం చిలకలగుట్ట నుంచి వెదురు కంక, కుంకుమ భరిణెల రూపంలో ఉండే సమ్మక్కను మేడారం నుంచి వచ్చే ప్రత్యేక గిరిజన పూజారులు పూజలు నిర్వహించి ఊరేగింపుగా డప్పుల చప్పుళ్ల మధ్య తీసుకవస్తారు. ఈ సందర్భంగా దారిలో మహిళలు మంగళహారతులు పట్టుకుని జేజేలు పలుకుతారు. సమ్మక్కను తీసుకవచ్చే వడ్డె పూనకంతో ఊగిపోతుంటారు. సమ్మక్కను తీసుక వచ్చే వడ్డె వారిని తొక్కుకుంటూ వెళ్లాలని దారికి అడ్డంగా కొందరు భక్తులు పడుకుంటారు. గద్దెపైకి సమ్మక్కను తీసుకవచ్చిన తర్వాత భక్తులు ఇద్దరు తల్లులను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఎక్కువగా శుక్రవారం రోజున జాతర ప్రాంగణాలు కిక్కిరిసిపోనున్నాయి. జాతరల్లో భక్తులు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. తాగునీటి వసతి, వైద్య సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించారు. గద్దెలను అందంగా అలంకరించి విద్యుత్తు కాంతులను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. గోలివాడ, గోదావరిఖని, కొలనూర్, నీరుకుళ్ల జాతర ప్రాంగణాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా బుధ వారం నుంచి నాలుగు రోజుల పాటు జాతర ప్రాంగణాలు భక్తులతో కిక్కిరిసిపోనున్నాయి.

● జిల్లా నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు..

ఇప్పటికే జిల్లాకు చెందిన అనేక మంది భక్తులు మేడారం వెళ్లివచ్చారు. జిల్లాలోని గోదావరిఖని, పెద్దపల్లి, యైటింక్లయిన్ కాలనీ, మంథని ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేకంగా 536 ఆర్టీసీ బస్సులను నడుపుతున్నది. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్సుల సంఖ్య పెంచింది. 2022లో 360 బస్సులను నడపగా, ఈసారి అదనంగా 176 బస్సులను నడుపుతున్నారు. పెద్దపల్లి నుంచి 203, గోదావరిఖని నుంచి 135, యైటింక్లయిన్ కాలనీ నుంచి 20, మంథని నుంచి 178 బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ బస్సులు మంథని, కాటారం, భూపాలపల్లి, గణపురం, జంగాలపల్లి, గోవిందరావుపేట, తాడ్వాయి మీదుగా మేడారం వెళుతున్నాయి. ఈనెల 18 నుంచే బస్సులు నడుపుతున్నారు. పెద్దపల్లి నుంచి పెద్దలకు రూ.380, పిల్లలకు రూ. 210, గోదావరిఖని, యైటింక్లయిన్ కాలనీల నుంచి పెద్దలకు రూ. 370, పిల్లలకు రూ. 200, మంథని నుంచి పెద్దలకు రూ. 320, పిల్లలకు రూ. 180 రూపాయలుగా బస్సు టిక్కెట్లు నిర్ణయించారు.

● సమ్మక్క గద్దెల వరకు ఆర్టీసీ బస్సులు..

మేడారం జాతరకు వెళ్లే భక్తులకు ఆర్టీసీ బస్సులే సురక్షితమని కరీంనగర్ ఆర్ఎం సుచరిత 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జాతర ప్రాంగణం వరకు ఆర్టీసీ బస్సులు వెళతాయని, ప్రైవేట్ వాహనాలను ప్రాంగణానికి 4 కిలోమీటర్ల దూరంలో నిలుపుతారని తెలిపారు. అక్కడినుంచి నడవాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. బస్సుల్లో తక్కువ ఖర్చుతో ప్రయాణం చేయవచ్చన్నారు. ప్రతి నిమిషానికి బస్సులను నడుపుతున్నామని, భక్తులు ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం ప్రయాణికులను కోరారు.

పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- ఆదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 20: జిల్లాలో ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈనెల 28 నుంచి మార్చి 19వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 18నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తారని, ఇందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇంటర్ పరీక్షల కోసం 24, టెన్త్ పరీక్షల కోసం 45 కేంద్రాలను ఏర్పాటు చేశామని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన ఆర్టీసీ బస్సులు నడపాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్షా పత్రాల లీకేజీలు ఎట్టి పరిస్థితుల్లో లేకుండా సూపరింటెండెంట్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రామగుండం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఇంటర్‌మీడియట్ అధికారి కల్పన, డీఈవో మాధవి, ఏసీపీలు రమేష్ క్రిష్ణ, అధికారులు పాల్గొన్నారు.

అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

- కేంద్ర మంత్రికి బీజేపీ నాయకురాలు సంధ్యారాణి ఫిర్యాదు



వినతిపత్రం ఇస్తున్న సంధ్యారాణి

జ్యోతినగర్, ఫిబ్రవరి 20: ఎన్టీపీసీ ఆధ్వర్యంలోని తెలంగాణ ఎన్టీపీసీ(టీఎస్‌టీపీపీ)ప్రాజెక్టులో కాంట్రాక్ట ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు జరిగాయని, విజిలెన్స్ సంస్థతో విచారణ చేపట్టాలని బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆమె వినతిపత్రాన్ని అందజేశారు.ఎన్టీపీసీ ప్రాజెక్టు కోసం వందలాది ఎకరాల భూములను ధారాదత్తం చేసిన భూనిర్వాసితులకు ఉపాధి కల్పించకుండా స్థానికేతరులకు కొంత మంది అక్రమార్కులు తెలంగాణ ప్రాజెక్టులో కాంట్రాక్టు లేబర్ ఉద్యోగాలు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఎన్టీపీసీ ఈ విషయంలో స్పందించడం లేదని, విజిలెన్స్ విచారణ జరిగేలా కృషి చేయాలని కోరారు.

పీహెచ్‌సీని సందర్శించిన జాతీయ బృందం

ఎలిగేడు, ఫిబ్రవరి 20 : ఎలిగే డు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ అషురెన్స్ స్టాం డర్డ్ బృందం మంగళవారం సం దర్శించింది. సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం నిర్వహణ, ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం వైద్యులు పల్లవి అన్నారావు, కృతిమాన్‌మహంత, పిహెచ్‌సి వైద్యులు నిస్సిక్రిష్టాన, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మణ్, రాజేశ్వరిదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నంబులాద్రి స్వామి కల్యాణోత్సవం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 20: మండలంలోని దేవునిపల్లిలోగల లక్ష్మీనంబులాద్రి స్వామి కల్యాణోత్సవం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణోత్సవంలో ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు, ఆలయ మాజీ చైర్‌పర్సన్ స్వరూప, చైర్మన్ అట్ల కుమారస్వామి, కేడీసీసీబీ డైరెక్టర్ దేవరనేని మోహన్‌రావు, మాజీ సర్పంచులు, వికాస తరంగిణి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'అర్చకుల వేతన బకాయిల విడుదలకు ఆదేశాలు'

పెద్దపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : కొన్నినెలలుగా అర్చకుల వేతన బకాయిలు, ఉద్యోగ భద్రతపై జరుగుతున్న పోరాటం మంగళవారం ప్రభుత్వంతో జరిగిన చర్చల ద్వారా ఫలప్రదం అయినట్లు దూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ ఒక ప్రకటలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారుడు హర్కార్ వేణుగోపాల్‌రావుతో చర్చలు జరిగాయని, ఈమేరకు ఆదేశాలు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలి : డీఈవో

జూలపల్లి, ఫిబ్రవరి 20 : విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా కృషి చేయాలని డీఈవో మాధవి అన్నారు. మండలంలోని తెలుకుంటలోగల ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల స్కూల్‌కాంప్లెక్సు సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైనా డీఈవో మాధవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి రాయడం, చదవడం నేర్పించేందుకు పాఠశాలల ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులు 10జీపీఏ సాధించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు.

మేడిపల్లి ఓసీపీని సందర్శించిన ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్

గోదావరిఖని, ఫిబ్రవరి 20:సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని మేడిపల్లి ఓసీపీని మంగళవారం మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్, క్లైమట్‌చేంజ్ డైరెక్టర్ తరుణ్ కత్తుల సందర్శించారు. నూతన ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్, కండీషన్స్ మైన్స్ క్లోజర్ యాక్టివిటీస్‌కు సంబంధించిన అయన పరిశీలించారు. మేడిపల్లి ఓసీపీలోని రాక్‌వాల్ ఏరియా, డ్రైన్స్, ప్లాంటేషన్స్, ఫెన్సింగ్ నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మేడిపల్లి ఓపెన్‌కాస్టుకు సంబంధించిన ఫారెస్ట్ ల్యాండ్, ప్లాంటేషన్, సెటిలింగ్ పాండ్, అటవీ విస్తరణకు అనువైన పరిస్థితులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. సింగరేణి ప్రభావిత గ్రామాల్లో సింగరేణి నిర్మించిన ఇంకుడుగుంతలు, సోలార్‌లైట్లు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను జీఎం శ్రీనివాస్ వివరించారు. ఎన్విరాన్‌మెంట్ జీఎం గణపతి, రవికిరణ్, శ్రీనివాస్, వన్‌గ్రూప్ ఏజెంట్ సైదులు, అధికారులు నాగేశ్వర్‌రావు, ఆంజనేయప్రసాద్, ప్రభాకర్, అభిలాష్, మల్లికార్జున్, వీరారెడ్డి ఉన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శివాజీ

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 20: బీజేపీ ఎస్‌సీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కాసిపేట శివాజీని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఉత్తర్వులను జారీ చేశారు. తనపై బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎస్‌సీ మోర్చా అధ్యక్షుడు శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 20: గోదావరిఖని ఉదయ్‌నగర్‌లోని సింగరేణి క్వార్టర్లలో మంగళవారం జల్లి రాయమల్లమ్మ(75)పై కోతులు దాడి చేశాయి. ఇంటి ముందు ఊడుస్తున్న ఆమెపై సుమారు 30కోతులు దాడి చేయడంతో పక్కనే ఉన్న డ్రైన్‌లో పడింది. దీంతో ఆమె తొంటి విరిగింది. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు.

జాతర శిలాఫలకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అంతర్గాం, ఫిబ్రవరి 20: గోలివాడ గోదావరి తీరాన వెలిసిన సమ్మక్క-సారలమ్మ జాతర శిలాఫలకాన్ని మంగళవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మనాలీ దంపతులు జాతరను ప్రారంభించారు. ఈసందర్భంగా వనదేవతలను దర్శించుకుని దర్శనానికి వచ్చే భక్తులకు ఆయురారోగ్యాలతోపాటు సుఖసంతోషాలతో ప్రసాదించాలని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు జరిగే వనదేవతల జాతర చాలా ఆధ్యాత్మికమైనదని, సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడం అంటే ప్రకృతి మాత ఒడిలో సేద తీరివారి ఆశీర్వచనాలు తీసుకోవడం లాంటిదన్నారు. సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు, కమిటీ వారికి తెలిపారు. జాతర కమిటీ చైర్మన్ అధ్యక్షులు, ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాతరలో అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

- గోదావరిఖని ఏసీపీ రమేష్

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 20: సమ్మక్క-సారలమ్మ జాతర సజావుగా జరిగేలా పూర్తి అప్రమత్తతో విధులు నిర్వహించాలని ఖని ఏసీపీ ఎం రమేష్ సిబ్బందికి సూచించారు. జాతర ఏర్పాట్లు, బందోబస్తుపై మంగళవారం సమ్మక్క గద్దెల వద్ద పోలీస్ సిబ్బందితో ఏసీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో జాతర జరిగేలా పోలీస్ శాఖ పక్షాన పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇద్దరు ఏసీపీ స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్‌లు, 23 మంది ఎస్సైలు, మరో 23 మంది ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్స్‌తో పాటు 28 మంది కానిస్టేబుల్లు విధుల్లో ఉంటారని ఏసీపీ పేర్కొన్నారు. అదనంగా 12 మంది స్పెషల్ పార్టీ పోలీస్‌లు, 27 మంది హోంగార్డులతో పాటు 48 మంది సింగరేణి ఎస్అండ్‌పీసీ సిబ్బంది, 29 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు జాతర డ్యూటీలో ఉండనున్నట్టు తెలిపారు. జాతర ప్రాంగణంలో 55 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశామని, జాతర మొత్తం సీసీ టీవీ పర్యవేక్షణలో ఉంచినట్టు తెలిపారు. రోడ్డుపై నిలిపి ఉంచే వాహనాలు, మద్యం సేవించి వాహనాలు నడిపే వారి వాహనాలను సైతం సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తామని తెలిపారు. వయోవృద్ధులు, వికలాంగులు, అనారోగ్య సమస్యలతో నడవలేని స్థితిలో ఉన్నవారి కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసినట్టు ఏసీపీ తెలిపారు. గోదావరి నది నీటితో లోతుగా ఉన్నందున నదిలో దిగడం, ఈత కొట్టడం నిచేయవద్దన్నారు. భక్తుల సౌకర్యం కోసం పోలీస్ కంట్రోల్ బోర్డును ఏర్పాటు చేశామని, అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూం సేవలను వినియోగించుకోవాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగించడం, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతరకు వచ్చే భక్తులు నిబంధనలు పాటించి, పోలీస్ సిబ్బందికి సహకరించి ప్రశాంత వాతావరణంలో జరిగేలా తమవంతు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, టూటౌన్ సీఐ ప్రసాదరావు, ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్‌తో పాటు ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల సలహాలు పాటించాలి : ఏసీపీ క్రిష్ణ

ఓదెల, ఫిబ్రవరి 20: జాతరలకు తరలివచ్చే భక్తులు పోలీసుల సలహాలు, సూచనలను పాటించాలని ఏసీపీ గజ్జి క్రిష్ణ కోరారు. మండలంలోని కొలనూరు గుట్టల్లో బుధవారం నుంచి నిర్వహించే సమ్మక్క,సారలమ్మ జాతర ఏర్పాట్లను మంగళవారం అయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మూడురోజులపాటు నిర్వహించే జాతరలో ప్రశాంతమైన వాతావరణంలో దర్శించుకోవాలని తెలిపారు. పోలీసుల చూపించిన ప్రదేశాల్లో వాహనాలను పార్కింగ్ చేయాలని, ఎవరికి ఆటంకాలు సృష్టించవద్దన్నారు. సీఐ జగదీష్, ఎస్ఐ అశోక్‌రెడ్డి, బీజేపీ నాయకులు కర్రె సంజీవరెడ్డి, కొంగరి అనిల్‌కుమార్, మాజీ చైర్మన్ శ్యాంరెడ్డి తదితరులున్నారు.

లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలి

- గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 20: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ అన్నారు. మంగళవారం గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్లేడ్‌లింగ్ ఫేస్ట్ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏసీపీ రమేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నాగండ్ల రవికుమార్, ఆర్జీ-3 సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, గాంధీ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్‌రావు, డైరెక్టర్ నాగండ్ల జమున, ప్రిన్సిపాల్స్ ఎం.వెంకన్న, ఎస్.తిరుపతిరెడ్డి, అధ్యాపకులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వనరులను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మంథనిరూరల్, ఫిబ్రవరి 20: విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ తమ లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. మండలం నాగారం గ్రామపంచాయతీలో పౌర పఠన మందిరం(లైబ్రరీ)ను అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఒక కుటుంబ జీవన విధానాన్ని విద్య మారుస్తుందని, కుటుంబంలో ఒక సభ్యుడు బాగా చదువుకొని మంచి స్థాయికి చేరుకుంటే, సమాజంలో చాలామందికి స్ఫూర్తి అవుతాడన్నారు. ప్రతి ఒక్కరికి చదువుకునేందుకు వీలుగా సమానమైన అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నాగారంలో ఏర్పాటు చేసిన పౌర పఠన మందిరాన్ని గ్రామంలోని నిరుద్యోగ యువతీ, యువకులు, విద్యార్థులు సంపూర్ణంగా వినియోగించుకోవాలని, త్వరలో అనేక ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీల భర్తీ జరుగుతుందని, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంచుతామని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ కొండ శంకర్, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ ప్రత్యేక అధికారి జనార్ధన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సెంటర్ కోసం పరిశీలన

రామగిరి, ఫిబ్రవరి 20: పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ల ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. మంగళవారం మంథని జేఎన్టీయూ కళాశాలలో కౌంటింగ్ కోసం అవసరమయ్యే గదులను ఆయన పరిశీలన చేపట్టారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మంథని జేఎన్టీయూ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాటు కోసం అవసరమయ్యే హాల్స్, స్ట్రాంగ్ రూమ్స్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేక గదితో పాటు కళాశాలలో అందుబాటులో ఉన్న గదుల వివరాలతో కూడిన నివేదికను ఎన్నికల సంఘం సీఈవోకు సమర్పిస్తామన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్, ఆర్డీవో హనుమానాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రామగుండం అభివృద్ధికి కృషి

- వాణిజ్య అవసరాలకు సింగరేణి ఖాళీ స్థలాలు
- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఫిబ్రవరి 20: రామగుండం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను పదవీ బాధ్యతలు తీసుకున్న తరువాత ప్రధానంగా నిధుల మంజూరుపై దృష్టి పెట్టానన్నారు. జెన్‌కో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రంతో పాటు ఎన్‌టీపీసీ యూనిట్ల విస్తరణకు ముఖ్యమంత్రి వద్ద హామీ తీసుకున్నామన్నారు. రూ.29కోట్లు గ్రామీణ రోడ్లకు ఆర్అండ్‌బీ మంజూరుఇచ్చిందని, దీనితోపాటు రూ.10కోట్ల డీఎంఎఫ్‌టీ, రూ.10కోట్లు స్పెషల్‌ఫండ్, రూ.4కోట్ల ఈజీఎస్ నిధులు మంజూరు చేయించానన్నారు. రామగుండం వాణిజ్యంగా అభివృద్ధి చెందితేనే ఈ ప్రాంతానికి మనుగడ ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని లక్ష్మీనగర్ అభివృద్ధికి రూ.35కోట్లు కేటాయించామన్నారు. సింగరేణి ఖాళీ స్థలాలను వాణిజ్య అవసరాలకు ఇప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆర్‌టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేయడంతో పాటు పెట్రోల్ బంక్ ఏర్పాటుచేస్తామన్నారు. సింగరేణి ప్రాంతంలో రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించనున్నారన్నారు. ఈ ప్రాంతంలో యువతకు శిక్షణనిచ్చి ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కూడా ఏర్పాటు చేస్తామని, తిలక్‌నగర్‌లో పనులు జరుగుతున్నాయన్నారు. సింగరేణి సహకారంతో సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణంలో పార్కు అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేష్, మారెల్లి రాజిరెడ్డి, కాల్వ లింగస్వామి, తిప్పారపు శ్రీనివాస్, పెద్దెల్లి తేజస్విని, కొలిపాక సుజాత, పెండ్యాల మహేష్, అనుమ సత్యనారాయణ, గుంపుల తిరుపతి, పెద్దెలి ప్రకాష్ పాల్గొన్నారు.

కార్యాలయానికి వచ్చేవారితో స్నేహపూర్వకంగా మెలగాలి

రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 20: అవసరాల కోసం నగరపాలక సంస్థ కార్యాలానికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెదలాలని రామగుండం నగర కమిషనర్ అధికారులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో శానిటేషన్, రెవెన్యూ, మెప్మా, ఇంజనీరింగ్ విభాగాల సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవల కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను ఏకపక్షంగా తిరస్కరించవద్దని, ఏ పత్రాలు జత చేయాలో ముందుగానే సూచనలు చేయాలన్నారు. తిరస్కరించడానికి తగిన కారణాలు తెలియజేయాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సిబ్బంది గైర్హజరుకావొద్దన్నారు. మున్సిపల్‌కు సంబంధించిన అన్ని అంశాలపై సిబ్బందికి అవగాహన ఉండాలని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచి పన్నుల వసూళ్లు పెంచాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.డీసీ త్రియంబకేశ్వర్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, సెక్రటరీ రాజు, సూపరింటెండెంట్ మనోహర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఏర్పాట్లు పరిశీలించిన ఈడీ



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఈడి పివి మునిశేఖర్

భగత్‌నగర్, ఫిబ్రవరి 20: మేడారం జాతరను పురస్కరించుకుని కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ఏర్పాట్లను ఆర్టీసీ ఈడి పివి మునిశేఖర్ మంగళవారం పరిశీలించారు. మేడారం సమ్మక్క క్యాంపులో భక్తులకు ఏర్పాటు చేసిన సదుపాయాలను, అందుబాటులో ఉన్న బస్సులు, భక్తుల రద్దీని పరిశీలించి అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీఆర్‌ఎం ఎన్‌సుచరిత, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎస్‌భూపతిరెడ్డి, డిపో మేనేజర్‌లు ఎల్‌మల్లేశం, మల్లయ్య ఉన్నారు.

భూ కబ్జా కేసులో బీఆర్‌ఎస్ నాయకుడి అరెస్టు

- మరో 8 మందిపై కేసు నమోదు



నందెల్లి మహిపాల్‌ను కోర్టుకు తీసుకెళ్తున్న రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 20 : నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, భూఆక్రమణకు సంబంధించిన కేసులో బీఆర్‌ఎస్ నాయకుడు నందెల్లి మహిపాల్‌ను మంగళవారం కొత్తపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో నందెల్లి మహిపాల్‌తో సహా చిట్యాల కిష్టమ్మ, గుండ రాజమల్లు, గంగాధర కనకయ్య, నక్క జితెందర్, నక్క పద్మ, తాటిపాముల రాజు, కొత్తకొండ శ్రీను అలియాస్ మైకేల్ శ్రీను, మాజీ కొత్తపల్లి తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌లు నిందితులుగా ఉన్నారు. వీరందరిపై ఐపీసీ సెక్షన్ 467, 468, 471, 420, 386, 506, 120బి రెడ్‌విత్ 34 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ3గా ఉన్న నందెల్లి మహిపాల్‌ను కొత్తపల్లి పోలీసులు ఉదయం అదుపులోకి తీసుకుని సుదీర్ఘ విచారణ అనంతరం సాయంత్రం కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ చేస్తూ జడ్జి ఆదేశాలతో కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. ఈ కేసులో మిగతా 8 మంది నిందితులను కూడా త్వరలో అరెస్టు చేయనున్నట్లు సమాచారం. ఎర్రం కనకారెడ్డి 2008 సంవత్సరంలో సర్వే నెంబరు 776, 777, 778లో 15 గుంటల స్థలాన్ని చిట్యాల కిష్టమ్మ, గంగాధర కనకయ్యతో కలిసి మోసపూర్వకంగా ఎర్రం కనకారెడ్డి అనే వ్యక్తి భూమిని కాజేయాలని నకిలీ సేల్ అగ్రిమెంట్ డీడ్‌ను రాజమల్లు పేరిట సృష్టించినట్లు పోలీసులు తెలిపారు. ఈ నకిలీ సేల్ అగ్రిమెంట్ డీడ్ ఆధారంగా ముందుగా ఎర్రం కనకారెడ్డి పేరిట ఉన్న ఒరిజినల్ అగ్రిమెంట్ డీడ్ ధ్రువపత్రాన్ని వారికున్న అధికార బలంతో రద్దు చేయించినట్లు తెలిపారు. అనంతరం ఆ భూమిని గుండా రాజమల్లు పేరిట రిజిస్ట్రేషన్ చేయించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆ భూమి తదుపరి నక్క జితేందర్, నక్క పద్మలకు విక్రయించారని, వారి నుంచి కొంత భాగం తాటి పాముల రాజుకు, కొత్తకొండ శ్రీను అలియాస్ మైకేల్ శ్రీనుకు విక్రయించే ప్రయత్నం చేశారని తెలిపారు. దీంతో బాధితుడు న్యాయం కోసం కోర్టులో పిటిషన్ వేయగా నందెల్లి మహిపాల్ బాధితుడిని పిలిపించి పిటిషన్ వాపసు తీసుకోవాలని లేదంటే చంపుతానని బెదిరించడమే కాకుండా సమస్య పరిష్కరించేందుకు తనకు 4 గుంటల భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారన్నారు. నిందితులంతా మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను కలిసి అతని సహకారంతో కోర్టులో పెండింగ్ ఉన్నప్పటికీ నిందితుల పేరిట మ్యుటేషన్ చేయించినట్లు తెలిపారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20: నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (దస్గర్‌వాడీ)లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ, డీఈవో అనుమతితో సైన్స్ టాలెంట్ టెస్ట్-24ను నిర్వహించారు. జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం, బయాలజికల్ సైన్స్ ఫోరం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా సైన్స్ ఆఫీసర్ చాడ జైపాల్‌రెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరించగా సెక్టోరియల్ ఆఫీసర్ కర్ర అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెల 18న నిర్వహించిన మండలస్థాయి ఆన్‌లైన్ సైన్స్ టాలెంట్ టెస్టులో గెలుపొందిన 44 మంది విద్యార్థులు జిల్లాస్థాయి టెస్ట్‌లో పాల్గొన్నారని, ఇందులో నుండి నలుగురిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు జైపాల్‌రెడ్డి తెలిపారు. మొదటి బహుమతిని ఎస్.నాగలక్ష్మి (టిఎస్‌ఎంఎస్‌గంగాధర), రెండవ బహుమతి బి.హర్షిని (జడ్పీహెచ్‌ఎస్ కోరపల్లి), మూడవ బహుమతి బి.నక్షత్ర (జడ్పీపిహెచ్‌ఎస్, కొత్తపల్లి), యు.శ్రీచక్ర గెలుచుకున్నట్లు ప్రపకటించారు.

ఎల్‌ఎల్‌బీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్,ఫిబ్రవరి20: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిసెంబర్ 2023లో నిర్వహించిన ఎల్‌ఎల్‌బీ ఐదవ సెమిస్టర్(రెగ్యులర్, బ్యాక్‌లాగ్)లా ఫలితాలను విడుదల చేసినట్లు మంగళవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు.యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు.

భూకబ్జాను అడ్డుకున్నందుకు దాడి

- కౌన్సిలర్‌పై క్రిమినల్ కేసు నమోదు

జమ్మికుంట, ఫిబ్రవరి 20: ప్రభుత్వ భూమిలో అక్రమంగా బోర్ వేస్తుండగా అడ్డుకున్న మాజీ వార్డు సభ్యుడు, అతని సన్నిహితులపై రాడ్డుతో దాడి చేసిన సంఘటనలో కౌన్సిలర్ మేడిపల్లి రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరగంటి రవి మంగళవారం తెలిపారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపల్లిలో కౌన్సిలర్ ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా బోర్ వేస్తున్నాడని తెలుసుకున్న మాజీ వార్డు సభ్యుడు కొలగాని రాజేందర్ తన సన్నిహితులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నాడు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా బోర్ ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. అక్కడే ఉన్న కౌన్సిలర్ ఎన్ని రోజులు నన్ను ఇలా టార్చర్ పెడుతారంటూ ఆగ్రహంతో ఇనుప రాడ్డుతో వారిపై దాడి చేశాడు. పలువురు స్వల్ప గాయాలతో తప్పించుకోగా మేడిపల్లి మల్లయ్య తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రెండు నెలల క్రితం కబ్జా విషయమై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడం వల్లే మనసులో పెట్టుకుని హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌గా ఉన్న రవీందర్ ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు ఆసుపత్రికి చేరుకుని గొడవకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి దాడులు దురదృష్టకరమని, ఇలాంటి సంఘటనలు పుణరావృతం కాకుండా చూడాలన్నారు.

● షోకాజ్ నోటీస్‌లు జారీ

జమ్మికుంట 3వ వార్డు కౌన్సిలర్ మేడిపల్లి రవీందర్‌కు జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. అవినీతి అక్రమాలకు ఎవరు పాల్పడినా సహించేది లేదని చెప్పారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 20: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇరువర్గాలు పరస్పరం దాడికి దిగిన సంఘటనలో కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం సోమారిపేట, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, అక్కపల్లి గ్రామాలకు చెందిన శివరాత్రి బాలకృష్ణ, అతడి బావ బత్తుల కృష్ణంరాజు, మందాటి శ్రీశైలం, మందాటి అశోక్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండలంలోని అక్కపల్లికి చెందిన మందాటి శ్రీశైలం, మందాటి అశోక్ ద్విచక్ర వాహనంపై మండల కేంద్రంలోని రెండో బైపాస్ రోడ్‌పై వెళ్తున్నారు. సోమారిపేటకు చెందిన బాలకృష్ణ, బొప్పాపూర్‌లోని కృష్ణంరాజు, లక్ష్మీ బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. రోడ్డు ప్రమాదానికి కారణమని పేర్కొంటూ ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి.

పంచాయతీ సెక్రెటరీ రిమాండ్

గంభీరావుపేట, ఫిబ్రవరి 20: గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామ పంచాయతీ సెక్రెటరీ మజీద్‌పై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు. 2022-2023 సంవత్సరంలో గంభీరావుపేట గ్రామ పంచాయతీ సెక్రెటరీగా పనిచేసిన సమయంలో మజీద్ రికార్డులు ఫోర్జరీ చేసినట్లు విజయలక్ష్మణ్ ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఇంటి నంబరు 4-1-100కి అదనంగా ఇంటి నంబరు 4-1-100/1 సృష్టించి రికార్డులను తారుమారు చేశాడన్నారు. రికార్డులు ఫోర్జరీ చేసినందుకు పంచాయతీ సెక్రెటరీ మజీద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బోనంతో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 20 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధంగా ఉన్న బద్దిపోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బద్దిపోచమ్మ అమ్మవారికి బోనం చెల్లించేందుకు భారీ సంఖ్యలో జనం తరలి రావడంతో క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి.

రాజన్న హుండీ ఆదాయం కోటి 77 లక్షలు

వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఖజానాకు హుండీ రూపంలో ఒక కోటి 77లక్షల పైచిలుకు ఆదాయం సమకూరింది. 13 రోజుల వ్యవధిలో భక్తులు శ్రీ స్వామివారి హుండీలలో సమర్పించిన నగదు, బంగారు, వెండి కానుకలను ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో గట్టి బందోబస్తు మధ్య మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఒక కోటి 77 లక్షల 74 వేల, 752 రూపాయల నగదు, 284 గ్రాముల 253 మిల్లీగ్రాముల బంగారం, 11 కిలోల, 300 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఈఓ డి కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ ఏఈఓలు ఎస్ హరికిషన్, జయ కుమారి, బి శ్రీనివాస్, పి నవీన్, ఆలయ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న కార్మికులు జీతాలు చెల్లించాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 20: రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బండారి శేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా ఆసుపత్రి ఎదుట కార్మికులు దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 306 జీవో ప్రకారం కార్మికులకు రూ. 16000జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికలకు సక్రమంగా జీతాలు రావడం లేదని ఆరోపించారు. కరీంనగర్‌లో రెండు నెలలు, హుజురాబాద్‌లో నాలుగు నెలలుగా కార్మికలు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్మికులు ఇంటి అద్దె, నిత్యవసర వస్తువులు తెచ్చుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను సంప్రదిస్తే 2023 జూలై నుంచి ప్రభుత్వ బడ్జెట్ విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బడ్జెట్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి అరుణ్, ఉపాధ్యక్షురాలు ఎన్ శారద, అలీమ్, అంజలి, శంరమ్మ, నరేష్, రాకేశ్, శ్రీను, రవిప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 20: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు పదివేల కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. స్కాలర్‌షిప్ భిక్ష కాదని, విద్యార్థుల హక్కు అని, వాటిని విడుదల చేయకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేటు ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కరీంనగర్‌లో విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. అవి ఆత్మహత్యలు కాదని, ప్రభుత్వ హత్యలని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, రాష్ట్ర లా ఫోరం కన్వీనర్ నక్క ప్రమోద్, నితీష్, అనూష, మధు, బామండ్ల నందు, శ్రీవర్ధన్, నాగరాజు, అనూష, వంశీ, అరుణ్, సాయికృష్ణ, యోగేశ్, ప్రదీప్, అబ్దుల్ పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



భక్తుల క్యూలైను

మల్యాల, ఫిబ్రవరి 20: కొండగట్టు ఆంజన్న క్షేత్రం మంగళవారం వేలాది భక్తులతో కిక్కిరిసింది. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. అంజన్న దర్శనం అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది.

ఎస్‌యూకు రూ.20 కోట్ల కేంద్ర నిధులు

- ఉప కులపతి ఎస్.మల్లేశ్



ప్రధాని వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వీసీ మల్లేశ్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి20: శాతవాహన విశ్వ విద్యాలయానికి ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ పథకం కింద రూ.20 కోట్లు మంజూరయ్యాయని ఉప కులపతి ఎస్.మల్లేశ్ ప్రకటించారు. మార్చి 2022లో విశ్వవిద్యాలయానికి యూజీసీ 12(బి) హోదా సాధించామని తెలిపారు. మంజూరైన 20 కోట్ల నిధుల్లో 10 కోట్ల రూపాయలు భవనాలకు, 6 కోట్ల రూపాయలు నూతన ఆవిష్కరణలకు, 4కోట్లు సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి కోసం వినియోగిస్తామని వివరించారు. మంగళవారం ప్రధాని మోదీతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప కులపతి మల్లేశ్, రిజిస్రార్ ఆచార్య ఎం. వరప్రసాద్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి నిధులు విడుదల చేసిన ప్రధానమంత్రి మోదీకి, రాష్ట్ర ప్రభుత్వానికి వీసీ కృతజ్ఞతలు తెలిపారు.

రెన్యూవల్ కాని ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 20: ప్రభుత్వ పరంగా రెన్యూవల్ కాని ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఫైర్ సేఫ్టీ, పార్కింగ్, పోల్యూషన్ అనుమతులు లేకుండా, స్థానికంగా డాక్టర్లు ఉండడం లేదని ఆరోపించారు. డాక్టర్లు లేకున్నా సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ పేర్లతో ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. కన్సల్టేషన్ వైద్యులతో పలు రకాల పరీక్షలు చేపిస్తూ, ఐసీయూ, జనరల్ రూములు, వెంటిలేటర్ చార్జీల పేరుతో లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి, గతంలో అనుమతి తీసుకున్న ఆసుపత్రులు రినివల్ చేసుకోలేదని ఆరోపించారు. దీనిపై నిజ నిర్ధారణ కమిటీ వేసి నిభందనలు పాటించని ఆసుపత్రులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు లక్పతి, నగర ప్రధానకార్యదర్శి రవీందర్‌నాయక్, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 20: మండలంలోని కనుకులగిద్దె గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి గాయపడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తాళ్లపల్లి అశోక్‌గౌడ్ తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారటంతో కిందపడ్డాడు. గమనించిన స్థానిక తోటి గీత కార్మికులు చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రాజేశం(ఫైల్)

ఎండపల్లి, ఫిబ్రవరి 20 : మండలంలోని సూరారం గ్రామానికి చెందిన చెల్పూరి రాజేశం(53) అనే రైతు విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందాడు. ధర్మపురి సీఐ, వెల్గటూర్ ఎస్ఐ కథనం ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన రాజేశం తన వ్యవ సాయ భూమిలో మక్క సాగు చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం వరకు పొలంలోనే పనులు చేసుకున్నాడు. తిరిగి ఇంటికి వచ్చే సమయంలో మక్కకు నీరు పారేందుకు రాత్రి మోటర్ వేసి అడవి పందుల బెడద నుంచి మక్కను కాపాడుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్ తీగలు అమర్చాడు. మంగళవారం ఉదయమే పొలం వద్దకు వెళ్లిన రాజేశం కాలుకు విద్యుత్ తీగ తగలడంతో షాక్ కొట్టి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమయం దాటినా ఇంటికి రాకపోవడంతో అనుమానంతో రాజేశం కొడుకు పొలం వద్దకు వెళ్లి చూసే సరికి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోడ దూకి పారిపోయిన గురుకుల విద్యార్థి

- క్షేమంగా ఇంటికి చేరిన విద్యార్థి

వెల్గటూర్, ఫిబ్రవరి 20: కోటిలింగాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్వహిస్తున్న స్తంభంపల్లి మహాత్మ జ్యోతిబాపూలే బాలుర బీసీ గురుకుల పాఠశాల నుంచి ఓ విద్యార్థి మంగళవారం గోడ దూకి పారిపోవడం కలకలం రేపింది. పెగడపెల్లి మండలం నంచర్లకు చెందిన సాయిని జానకిరాం అనే 8వ తరగతి విద్యార్థి మధ్యాహ్న సమయంలో పాఠశాల ప్రహరీ దూకి పారిపోయాడు. హాజరు తీసుకునే సమయంలో విద్యార్థి లేకపోవడంతో గమనించిన పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ప్రిన్సిపల్ రాజేశం, సిబ్బంది విద్యార్థి కోసం వెతకడం ప్రారంభించారు. పాఠశాల నుంచి తమ కొడుకు పారిపోవడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు మూడు గంటల తరువాత సదరు విద్యార్థి రాజారాంపల్లి బస్‌స్టాండ్‌లో ఉన్నాడనే సమాచారం తెలవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థి పారిపోవడంతో తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. చివరికి విద్యార్థి క్షేమంగా నంచర్లలోని తమ ఇంటికి చేరుకోవడంతో కథ సుఖాంతం అయింది. కాగా జాతరకు వెళ్లాలని విద్యార్థి పారిపోయినట్లు ప్రిన్సిపాల్ రాజేశం తెలిపారు. కానీ సహచర విద్యార్థులు దాడి చేయడంతో తట్టుకోలేక తమ కొడుకు పారిపోయి ఇంటికి వచ్చాడని విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. ఇలాంటిసంఘటనలు జరుగకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


మేడారం జాతరకు తరలివస్తున్న భక్తులు

జన జాతరకు వేళాయె..

నేటి నుంచి మేడారం కుంభమేళా ప్రారంభం

▸▸ నేడు గద్దెకు చేరుకోనున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు ▸▸ నాలుగు రోజుల పాటు పూజలందుకోనున్న వనదేవతలు

వరంగల్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం జనారణ్యం అవుతోంది. వనదేవతల ఆగమనానికి వేళవుతుండటంతో భక్తులతో మేడారం పోటెత్తుతోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అద్భుత క్షణాలు బుధవారం సాక్షాత్కరించనున్నాయి. తొలిరోజు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో మేడారం జనగుడారమవుతోంది. ఎడ్లబండ్లు, కాలి నడకన, కార్లు, ఆటోలు, జీపులు, బస్సుల్లో భక్తులు మేడారం చేరుకుంటున్నారు.

నేటి నుంచి జాతర

తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. రెండేళ్లకోసారి మాఘశుద్ధ పౌర్ణమిన రోజైన బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దట్టమైన అరణ్యంలోని మేడారంలో జరిగే ఈ మహాజాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. పూర్తిగా ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో జరిగే ఈ జాతరలో ప్రకృతే దైవంగా.. వనదేవతల స్మారకార్థం నిర్మించిన కర్రల వద్దే పూజలు నిర్వహిస్తారు. వనదేవతలకు పసుపు, కుంకుమ, ఒడి బియ్యం, ఎదుర్కోళ్ల తో పాటు బంగారాన్ని (బెల్లం) మొక్కుగా చెల్లిస్తారు.

గద్దెపైకి చేరిన జంపన్న

జాతర నేపథ్యంలో సమ్మక్క తనయుడు జంపన్న కన్నెపల్లి నుంచి మంగళవారం రాత్రి 8గంటలకు జంపన్న వాగు ఒడ్డునున్న గద్దెకు చేరుకున్నారు. పోలెబోయిన వంశీయులు పూజారి సత్యం ఆధ్వర్యంలో పగిడె రూపంలో ఉన్న జంపన్నను గద్దెపై కొలువుదీర్చి పూజలు చేశారు.


సమ్మక్క గద్దె

నేడు గద్దెకు చేరనున్న సారలమ్మ

జాతర తొలిరోజున కన్నెపల్లి ఆడపడుచు సారలమ్మ గద్దెపైకి రానుంది. సారలమ్మ కొలువైన పల్లె కన్నెపల్లిలో బుధవారం ఉదయమే ప్రధాన పూజారి కాక సారయ్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సారయ్యతోపాటు మిగతా పూజారులు ఆలయాన్ని శుద్ధి చేసి అలికి ముగ్గులతో అలంకరిస్తారు. సాయంత్రం ఆలయంలో ఆదివాసీ పూజారులు రహస్య పూజలు జరుపుతారు. ఈ సమయంలోనే పూజారి సారయ్యను సారలమ్మ ఆవహిస్తుంది. సారయ్యకు పూనకం రావడంతో ఆలయం నుంచి గద్దెల వైపు పూజారులు సారలమ్మను తీసుకవస్తారు. కన్నెపల్లి మీదుగా తన తమ్ముడు జంపన్నను పలకరిస్తూ జంపన్నవాగును పూజారులు దాటుతారు. ఈ సమయంలోనే శివసత్తుల పూనకాలతో భక్తుల పుణ్యస్నానాలతో జంపన్నవాగు పులకరిస్తుంది. కన్నెపల్లి నుంచి మేడారంలో ఉన్న సమ్మక్క ఆలయానికి సారలమ్మ చేరుకుంటుంది.


వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పగిడిద్దరాజు, గోవిందరాజుల రాక

మంగళవారం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు మేడారం బయలుదేరారు. ఆదివాసీలు కాలినడకన పగిడిద్దరాజును పడిగె రూపంలో తీసుకుని బుధవారం సాయంత్రానికి మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకుంటారు. ఇక పగిడిద్దరాజు తమ్ముడు గోవిందరాజులు కూడా బుధవారమే ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి బయలుదేరి, మేడారం చేరుకుంటారు. సమ్మక్క ఆలయంలో ముగ్గురికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం రాత్రి 8గంటలకల్లా మేడారంలోని గద్దెలపైకి చేరుకుంటారు. దీంతో తొలిరోజు జాతర అట్టహాసంగా ప్రారంభం అవుతుంది.

23న మొక్కులు

జాతరలో మూడోరోజు శుక్రవారం గద్దెలపై సమ్మక్క, సారలమ్మల తోపాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు చేరుకోవటంతో భక్తులు రాత్రి పగలు తేడా లేకుండా మొక్కులు చెల్లించేందుకు బారులు తీరుతారు. 23వ తేదీ శుక్రవారం వనదేవతలకు మొక్కులు చెల్లింపులు చేస్తారు. తీరొక్క మొక్కులతో వనదేవతలను శరణ కోరుతారు.

22న సమ్మక్క ఆగమనం

జాతరలో రెండోరోజైన గురువారం 22న మేడారంలోని చిలుకలగుట్టపై రహస్య ప్రాంతంలో సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్యతో పాటు వడ్డెలు మునిందర్, బొక్కయ్య ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం కుంకుమ భరణె రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకుని ప్రధాన పూజారి కిష్టయ్య చిలుకలగుట్టపై నుంచి కిందకు వస్తున్న క్రమంలో ములుగు ఎస్పీ గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్క రాకను స్వాగతిస్తారు. ఆ సమయంలో కోట్లాది భక్తుల జయజయ నినాదాలతో మేడారం హోరెత్తుతుంది. సమ్మక్క ఆగమనంతో దారి పొడవునా వేలాది మేకలు, గొర్రెలు, కోళ్ల తలలు తెగి రక్తం చిందిస్తాయి. పూజారులు అత్యంత భక్తిశ్రద్ధలతో రాత్రి 10గంటల కల్లా సమ్మక్క గద్దెకు చేరుకోవటంతో మహాజాతర తుది ఘట్టానికి చేరుకుంటుంది.

24న వనప్రవేశం

జాతరలో చివరి రోజైన నాలుగో రోజు శనివారం సాయంత్రం 6గంటలకు సమ్మక్క తిరిగి చిలుకలగుట్టకు తిరుగు ప్రయాణం అవుతుంది. సమ్మక్క వన ప్రవేశంతో సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా వారి స్వగ్రామాలకు పయనం అవుతారు. దీంతో జాతర ముగుస్తుంది.


సారలమ్మ గద్దె


కన్నెపల్లి నుంచి జంపన్నను గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠిస్తున్న వడ్డెలు


మేడారం దారిలో వాహనాల బారులు..


మంగపేట మండలం కమలాపురం నుంచి ఎడ్లబండ్లపై జాతర కొస్తున్న భక్తులు



సమ్మక్క-సారలమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 20: గోదావరిఖని గోదావరి తీరాన సమ్మక్క-సారలమ్మ జాతరకు భారీ ఏర్పాట్లు జరిగాయి. గతంలో కంటే భిన్నంగా ఈసారి సింగరేణి, ఎన్‌టీపీసీ, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. సుమారు 50ఎకరాల స్థలాన్ని చదును చేసి జాతర కోసం సిద్ధం చేశారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చొరవతో ఈసారి సింగరేణి ఏర్పాట్లలో భాగస్వామ్యం అయ్యింది. పుష్కరఘాట్ వద్ద మహిళలు దుస్తులు మార్చుకునే గదులను సిద్ధం చేశారు. స్నానాలకు ప్రత్యేకంగా షవర్లు ఏర్పాటు చేశారు. జాతర ప్రాంగణమంతా ఫ్లడ్‌లైట్లతో లైటింగ్ ఏర్పాటు చేశారు. సింగరేణి సంస్థ ప్రత్యేకంగా తాగునీటి కోసం పైప్‌లైన్లను ఏర్పాటుచేసింది. ఎన్‌టీపీసీ సంస్థ సమ్మక్క-సారలమ్మ గద్దెలకు పెయింటింగ్ వేయించడం, ఇతర పనులకు సహకారాన్ని అందించింది. ఈసారి మున్సిపల్ కార్పొరేషన్‌కు జాతర భారంపడలేదు. కార్పొరేషన్‌లో నిధులు లేకపోవడంతో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సింగరేణి, ఎన్‌టీపీసీ సంస్థలను భాగస్వామ్యం చేశారు. దేవాదాయశాఖ కూడా క్యూలైన్ల ప్రాంతంలో షెడ్డు నిర్మించింది. జాతర ప్రాంగణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటుచేశారు. 23సీసీ కెమెరాలను జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. జాతర ప్రాంతమంతా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కమాండ్ అండ్ కంట్రోల్ స్టేషన్‌ను సిద్ధం చేశారు. గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, సీసీఆర్‌బీ ఏసీబీ వెంకట్రావ్, సీఐలు, ప్రమోద్‌రావు, ప్రసాద్‌రావు, ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్, వేణుగోపాల్, సీసీఆర్‌బీ సీఐ స్వామితో పాటు 23మంది ఎస్‌ఐలు, 23మంది ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 80మంది కానిస్టేబుళ్లు, సింగరేణి ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది మొత్తం 185 మంది, 12మంది స్పెషల్‌పార్టీ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు.

నేడు గద్దెలకు సారలమ్మ...

బుధవారం ఉదయం 10గంటలకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, మేయర్ అనీల్ కుమార్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తారు. సాయంత్రం బీ గెస్టహౌస్ సమీపంలోని సారలమ్మ గుడి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకువస్తారు. గురువారం జనగామ నుంచి సమ్మక్కను తీసుకువస్తారు. శుక్రవారం పూజలు నిర్వహించి శనివారం వన ప్రవేశం చేయిస్తారు. గోదావరిఖని వద్ద జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు పెద్దపల్లి, మంచిర్యాల జిలాల నుంచి 4లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

అంతర్గాం, ఫిబ్రవరి 20: గోలివాడ గోదావరి తీరంలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంతాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరిఖని, అంతర్గాం ప్రాంతంలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతరకు ఈసారి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకునే అవకాశం ఉందన్నారు. జాతర విజయవంతానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని, పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న పనులను త్వరగాపూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గద్దెలను, రోడ్డు, తాగునీటి వసతులను ఆయన పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని,జాతర సమయంలో నది లోపలికి వెళ్లకుండా ఏర్పాట్లు చేయాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


ఈసాలతక్కళ్లపల్లిలో పూర్తయిన జాతర ఏర్పాట్లు

పాలకుర్తి,ఫిబ్రవరి 20: మండలంలోని ఈసాలతక్కళ్ళపల్లి, రాణాపూర్, వేమునూర్ గ్రామాల్లో సమ్మక్క, సారలమ్మల జాతరకు సర్వం సిద్ధం చేశారు. బుధవారం సారలమ్మ వనం నుంచి వచ్చి గద్దెల వద్ద కొలువు తీరి భక్తులకు దర్శనం ఇవ్వనుంది. జాతరలో భక్తులకు ఎలాం టి ఇబ్బందులు తలెత్తకుండా బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నారు. పుట్నూర్, బసంత్‌నగర్ పీహెచ్‌సీ ప్రధాన వైద్యులు సాయి సూర్య, హరిత ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను ఏర్పాటుచేయనున్నారు.

సుల్తానాబాద్, ఫిబ్రవరి 20: మండలంలోని నీరుకుళ్లలో సమ్మక్క సారలమ్మ జాతరలకు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే గర్రెపల్లి, నారాయణపూర్, తొగర్రాయి గ్రామాల్లోనూ ఏటా జాతర నిర్వహిస్తారు. నీరుకుళ్లలో జరిగే జాతరకు లక్షల మంది భక్తులు హాజరవుతారు. జాతర ఏర్పాట్లను తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, సీఐ జగదీష్, ఇతర అధికారులు పర్యవేక్షిస్తున్నారు.


నీరుకుళ్లలో భక్తుల కోసం ఏర్పాటుచేసిన క్యూలైన్లు

ధర్మారం, ఫిబ్రవరి 20: బుధవారం నుంచి సమ్మక్క-సారలమ్మ జాతర పల్లెప్రాంతాల్లో జరగనుంది. ధర్మారం మండలంలో ధర్మారం, ఎర్రగుంటపల్లి, కొత్తూర్, నందిమేడారం, బొట్లవనపర్తి, కటికెనపల్లి గ్రామాల్లో సమ్మక్క-సారలమ్మ జాతరకు నిర్వహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. బుధవారం సాయంత్రం సారమ్మను కోయ పూజారులు గద్దె వద్దకు తీసుకువచ్చి ప్రతిష్ఠిస్తారు. జాతర ప్రదేశాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎలిగేడు, ఫిబ్రవరి 20 : ఎలిగేడు, లాలపల్లి పొలిమేరలో పెల్లిపోరు గుట్టపై వెలిసిన సమ్మక్క సారలమ్మ జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతరకు చొప్పదండి, జూలపల్లి, చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు తరలివస్తారు. భక్తుల సౌకర్యార్థం స్నానాలు, తాగునీరు, నిరంతర విద్యుత్, చలువపందిళ్లు, టెంట్లు వేశారు. అలాగే సమ్మక్క, సారలమ్మ గద్దెలు నూతనంగా నిర్మించిన రంగులద్దారు. జాతర కమిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, కోశాధికారి బూర్ల వెంకటసత్యం, కవ్వంపల్లి స్వామి, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో యాదగిరి భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్ పరిశీలించారు.

దారులన్నీ మేడారం వైపే..

- భారీగా వాహనాల్లో తరలుతున్న భక్తులు
- కిక్కిరిసిపోతున్న ప్రయాణ ప్రాంగణాలు

మంథని, ఫిబ్రవరి 20: మేడారం జాతరలో వన దేవతల ఓడి చేరేందుకు భక్తులంతా ఉత్సాహంగా పయనమవుతున్నారు. బుధ, గురువారాల్లో శ్రీసమ్మక్క-సారక్క తల్లులు వనం వీడి గద్దెలపై కొలువుదీరనుండటంతో మంగళవారం మంథని డివిజన్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు మేడారం తరలివెళ్తున్నారు. దీంతో పల్లెలన్నీ ఖాళీ కానున్నాయి. మంథని-పెద్దపల్లి, గోదావరిఖని-మంథని, మంథని-కాటారం ప్రధాన రహదారులపై జాతరకు వెళ్లే వాహనాల రద్దీ విపరీతంగా ఉంది. ఎటు చూసినా మేడారం వెళ్లే భక్తుల సందడే కనిపిస్తోంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికుల రద్దీ కొనసాగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆర్టీసీ సిబ్బంది చర్యలు చేపట్టారు. డివిజన్‌లోని మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో 10కి పైగా మినీ జాతరలను బుధవారం నుంచి మూడు రోజులపాటు శ్రీసమ్మక్క-సారలమ్మ జాతరలను నిర్వహిస్తారు. దీంతో గ్రామాల్లో సమ్మక్క-సారక్కల జాతర సందడితో ప్రజలు భక్తి పారవశ్యంలో మునిగిపోతున్నారు.


మంథని బస్టాండ్‌లో భక్తుల రద్దీ

భక్తులతో కిటకిటలాడుతున్న 'ఖని' బస్టాండ్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 20: మేడారం జాతరకు ఒక రోజు ముందే గోదావరిఖని ఆర్‌టీసీ బస్టాండ్ భక్తులతో కిటకిటలాడింది. బుధవారం నుంచి జాతర ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఇండ్ల వద్ద మొక్కులు చెల్లించి భక్తులు మేడారం జాతరకు పయనమవుతున్నారు. మంగళవారం గోదావరిఖని బస్టాండ్‌లో భక్తులు ఆర్‌టీసీ బస్సుల కోసం క్యూకట్టారు. డిపో మేనేజర్ నాగభూషణం భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా లయన్స్‌క్లబ్, ఎన్‌సీసీ, ఆర్‌టీసీ సిబ్బందితో సేవలందిస్తున్నారు. మంచినీటి అందుబాటులో ఉంచారు. చలువ పందిళ్లను ఏర్పాటుచేశారు. ఉదయం నుంచే బస్టాండ్‌లో మేడారంనకు వెళ్లే భక్తులు బారులు తీరారు.

కోల్‌బెల్ట్‌లో ఇంటింటా సమ్మక్క..

- మేకలు, కోళ్లతో మొక్కులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 20: రెండేళ్లకోసారి వచ్చే వనదేవతల జాతర కోల్‌బెల్ట్‌లో ఘనంగా నిర్వహిస్తారు. ఏ ఇంట చూసినా సమ్మక్క-సారలమ్మ మొక్కులను చెల్లిస్తారు. సింగరేణి సంస్థ తన వార్షిక ఉత్పత్తి లక్ష్యానికి భంగం కలుగుతుందని 1992లో గోదావరిఖని వంతెన వద్ద అప్పటి జీఎం ఖర్గ్ ఆధ్వర్యంలో ఈ జాతరను ఏర్పాటుచేశారు. బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగవద్దని ఏర్పాటుచేసిన జాతరకు శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, చెన్నూరు ప్రాంతాలనుంచి ఇక్కడి జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. చాలామంది కార్మికులు తమ కుటుంబాలతో మేడారం జాతరకు తరలివెళ్లడంతో మూడురోజులపాటు బొగ్గు ఉత్పత్తి నష్టపోతుందని భావనతో గోదావరి వంతెన వద్ద ఈ జాతరను ఏర్పాటు చేశారు. మేడారం తరువాత మినీ మేడారంగా పిలువబడే ఈ జాతరకు పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు. సమ్మక్క జాతరకు 15రోజుల ముందు అమావాస్య దాటిన తరువాత ప్రతి ఇంట్లో సమ్మక్క-సారలమ్మలను పూజించి మేకలతో, కోళ్లతో ఘనంగా మొక్కులు చెల్లించి బంధువులను పిలిచి భోజనాలను ఏర్పాటుచేస్తారు. అనంతరం చాలామంది మొదటికి మేడారం జాతరకు పయనమవుతుంటారు. సమ్మక్క-సారలమ్మ గద్దెలకు వచ్చిన తర్వాత మొక్కులు చెల్లించి తిరుగు ప్రయాణమవుతారు. రెండేళ్లకోసారి వచ్చే సమ్మక్క జాతరకు కోల్‌బెల్ట్‌లో బెల్లం, మేకలు, కోళ్లు, మద్యం వ్యాపారం జోరుగా సాగుతుంది. సమ్మక్క-సారలమ్మ జాతర వస్తే కోల్‌బెల్ట్‌లో ఎక్కడ చూసినా మద్యం దుకాణాలు కిటకిట, ప్రతి ఇంట్లో బంధువులతో కళకళలాడుతుంది.

'కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం'

సుల్తానాబాద్, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని, సభ్యత్వం ఉంటే చాలని వారికి పార్టీ బీమా కల్పిస్తుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లి గ్రామానికి చెందిన తొంటి బీరయ్య అనే కార్యకర్త కొన్ని రోజుల క్రితం మృతిచెందగా వారి కుటుంబానికి బీమా కంపెనీ నుంచి వచ్చిన రెండు లక్షల రూపాయల చెక్కును కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నయ్య గౌడ్, ప్రకాష్‌రావు, దామోదర్‌రావు, సాయిరి మహేందర్ పాల్గొన్నారు.

●ఎలిగేడు: మండలంలోని శివపల్లి తన స్వగృహంలో మంగళవారం కాంగ్రెస్‌పార్టీ సభ్యత్వం ద్వారా రెండు కుటుంబాలకు రూ.4లక్షల చెక్కులను ఎమ్మెల్యే విజయరమణారావు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన జాతరగొండ రజిత, ఓదెలు భార్యభర్తలు కొన్నిరోజుల క్రితం విద్యుత్ షాక్‌కు గురై మరణించడంతో వారికి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ పక్షాన రూ.2లక్షలు అందించారు.

సమ్మక్కను దర్శించుకున్న 'కొప్పుల' దంపతులు

ధర్మారం,ఫిబ్రవరి20: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గల సమ్మక్క-సారలమ్మలను మంగళవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్-స్నేహలత దంపతులు ప్రజాప్రతినిధులతో కలసి దర్శించుకున్నారు. వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

బాలికలకు రక్త పరీక్షలు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం ఆర్‌బీఎస్‌కే వైద్యుల ఆధ్వర్యంలో బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు చక్రధర్, ఏఎన్‌ఎంలు స్వప్న, రజిత, ఫార్మాసిస్టు సౌజన్య, ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'జోడో యాత్రను విజయవంతం చేయాలి'

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 20: జిల్లా కేంద్రంలో ఈనెల23న నిర్వహించనున్న మాదిగల జోడో యాత్రను విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కపాక సంపత్ పిలుపునిచ్చారు. పెద్దపల్లి జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన మాదిగ జేఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సంపత్ మాట్లాడారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కోరే సదానందం, కమల్, శ్రీనివాస్, సాయి, వంశీ, గట్టయ్య, సురేందర్ పాల్గొన్నారు.

టీజీవో రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

పెద్దపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏనుగుల సత్యనారాయణ, ఇతర కార్యవర్గ సభ్యులు, సలహాదారులను మంగళవారం హైదరాబాద్‌లో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు తూము రవీందర్, లెక్కల రామచంద్రారెడ్డి, తదితరులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

జూలపల్లి, ఫిబ్రవరి 20. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో బీటి రోడ్డు, మురికి కాలువ నిర్మానం, అభివృద్ధి పనులకు నిదులు మంజూరిచేయాలని కోరుతూ మంగళవారం గ్రామ నాయకులు కంకనాల జ్యోతిబసు ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమనారావును కలిసి వినతిపత్రం అంజేసారు. పెద్దాపూర్ గ్రామ అభివృద్ధికి నిదులు సమకూర్చేందుకు తన వంతు కృషిచేయనున్నట్లు ఎమ్మెల్యే విజయరమనారావు సానుకూలంగా ఉన్నాడని జ్యోతిబసు పేర్కోన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయకులు కంకనాల జ్యోతిబసు, బొజ్జశ్రీనివాస్, అల్లాడి శేకర్ పలువురు ఉన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం'

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 20: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ ఘన విజయం తథ్యమని టీపీసీసీ అధికార ప్రతినిధి ఉమేష్ రావు జోస్యం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐబీ గెస్టహౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ విధ్వంసకర రాజకీయాలకు తెరలేపిందని ఆరోపించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భూషణవేన సురేష్ గౌడ్, అక్బర్ అలీ, సయ్యద్ మస్రత్, బూతగడ్డ సంపత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, సుభాష్ రావు, బొంకూరి అవినాష్, అరె సంతోష్, బాషా, తూముల మహేష్, బొక్కల సంతోష్ పాల్గొన్నారు.